సాక్షి
ఖమ్మం
శనివారం । 29 । జూన్ । 2024



జాబ్‌మేళాకు బారులు

కూసుమంచి మండలం పాలేరులో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు 2,014మంది యువతీ, యువకులు హాజరయ్యారు. 8లో



.. మతోన్మాదులకు హెచ్చరిక

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మతోన్మాదులకు హెచ్చరిక వంటివని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 26°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రైతు ప్రయోజనాల పరిరక్షణకే లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు

ఖమ్మంలీగల్: రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటుచేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం ఆయన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల పారా లీగల్ వలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కామేపల్లి మండలం ముచ్చర్ల, ఎర్రుపాలెం మండలం మీనవోలులో రైతులకు న్యాయ సలహాలు, సూచనలు అందించేందుకు ఏర్పాటుచేయగా, వలంటీర్లు చట్టాల పై అవగాహన పెంపొందించుకుని రైతులకు అండగా నిలవాలని సూచించారు. ఈ క్లినిక్‌లు ప్రతీ మంగళ, శుక్రవారాలు పనిచేస్తున్నాయనే అంశంపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు.

ప్రశాంతంగా హెచ్‌డబ్ల్యూఓ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల ఎంపికకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన పరీక్షకు ఉదయం 1,610మందికి గాను 1,014మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1,610మంది అభ్యర్థులకు గాను 1,028మంది హాజరయ్యారు. ఎలాంటి అంతరాయాలు లేకుండా పరీక్షలు కొనసాగాయని అధికారులు వెల్లడించారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ఎంపిక పోటీలు ప్రారంభం



పరుగుపందెం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్: స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించేందుకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. నాలుగు తరగతిలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఈ పోటీలకు తొలిరోజు 16 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈమేరకు వివిధ పరీక్షలు నిర్వహించారు. పోటీలు శనివారం కూడా జరగనుండగా ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కోచ్‌లు, పీడీలు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, నగేష్, కైలాస్, సుధాకర్, కృష్ణమూర్తి, కృష్ణయ్య, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లు సామాజిక సేవలో పాల్గొనాలి



మాట్లాడుతున్న సీపీ

కూసుమంచి: ఎన్‌సీసీ కేడెట్లు సామాజిక సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 11వ బెటాలియన్ ఆధ్వర్యాన ఈనెల 19న మొదలైన వార్షిక శిక్షణ శిబిరంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాలకు చెందిన 598 మంది కేడెట్లు పాల్గొనగా శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవడడానికి ఎన్‌సీసీ దోహదం చేస్తుందని తెలిపారు. ఈమేరకు శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందించగా, కేడెట్లు ఇచ్చినసాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కమాండెంట్ కల్నల్ సునీల్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

ధరణి.. దౌడ్!

'ధరణి' దరఖాస్తుల పరిష్కారంలో అధికార యంత్రాంగం దూసుకెళ్తోంది. దరఖాస్తు చేసుకున్న రైతులు కొన్నేళ్లుగా వివిధ సాంకేతిక కారణాలతో ఇబ్బంది పడుతున్నారు. చిక్కుముడులన్నీ విడిపోయేలా ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యాన ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధతో సమీక్షలు నిర్వహిస్తూ జిల్లా యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. దీంతో జిల్లా అధికారులు దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించారు. ఇప్పటివరకు 78,710 దరఖాస్తులు అందగా, అందులో 57,101 దరఖాస్తులను పరిష్కరించడమే కాక మిగతావి సైతం త్వరగా పూర్తిచేయాలనే పట్టుదలతో ఉన్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

వేగంగా దరఖాస్తుల పరిష్కారం

- కొన్నాళ్లుగా సాంకేతిక సమస్యలతో సతమతం
- ఇప్పుడు చకచకా సాగుతున్న ప్రక్రియ
- జిల్లాలో 78,710 దరఖాస్తులకు 57,101 క్లియర్



కలెక్టరేట్‌లో ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఉద్యోగులు (ఫైల్)

అడ్డంకిగా సాంకేతిక సమస్యలు

ధరణి వెబ్‌సైట్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలతో దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ ఇన్నాళ్లు ముందుకు సాగలేదు. కొన్ని సమస్యలను పరిష్కరించే వీలు లేకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయాయి. తొలినాళ్లలో సమస్యలు సక్రమంగా నమోదు కాకపోవడం, భూములు నిషేధిత జాబితాలోకి వెళ్తుండడంతో తమ భూములు దక్కుతాయో, లేదోనన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమైంది. అయితే ఈ సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వచ్చారు. వెబ్‌సైట్‌లో 188 సాంకేతిక సమస్యలను గుర్తించిన ఉన్నతాధికారులు దాదాపు 80 శాతం మేర పరిష్కరించడంతో దరఖాస్తుల క్లియరెన్స్ వేగం పుంజుకుంది.

పీఓబీ సమస్యకు చెక్

జిల్లాలో భూములకు సంబంధించి పీఓబీ(ప్రొహిబిటెడ్ ఆర్డర్ బుక్) సమస్య ఎక్కువగా ఉంది. చాలా మంది భూమికి పట్టా ఉన్నా నిషేధిత భూమి జాబితాలో చేర్చారు. గతంలో నాగార్జునసాగర్ కెనాల్ కోసం భూసేకరణ జరగగా.. కొందరు రైతుల పదెకరాల్లో ఎకరం సేకరిస్తే మిగతా తొమ్మిది ఎకరాలు సైతం ప్రభుత్వ భూమిగా నమోదైంది. దీంతో ఇలాంటి భూములను రిజిస్ట్రేషన్ శాఖ పీఓబీలో పెట్టింది. రాష్ట్రంలోనే జిల్లాలో ఈ సమస్య ఎక్కువగా ఉండగా, చింతకాని మండలంలోనే నాలుగు వేల ఎకరాలు పీఓబీలో నమోదైంది. దీంతో గత కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రెవెన్యూ యంత్రాంగంతో క్లియర్ చేయించారు. కొన్ని భూములకు రైతుబంధు సాయం అందుతున్నా రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చిన జాబితా ఆధారంగా పరిష్కరించారు. ఇంకొన్నిచోట్ల రైతులు ముందుకు రాకున్నా కలెక్టర్ చొరవ తీసుకుని పరిష్కరించడంతో రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధిక శాతం దరఖాస్తులు పరిష్కారమయ్యాయి.

ఆ మూడింటికే ఎక్కువ..

జిల్లాలో మొత్తం 78,710 మంది రైతులు భూ సంబంధిత సమస్యలపై ధరణి వెబ్‌సైట్‌ను ఆశ్రయిస్తే 57,101 మంది దరఖాస్తులను క్లియర్ చేశారు. ఇక సరైన వివరాలు, తగిన డాక్యుమెంట్లు లేకపోవడంతో 13,269 దరఖాస్తులను తిరస్కరించారు. దీంతో 8,340 దరఖాస్తులు మాత్రమే మిగిలాయి. కాగా, పీఓబీ సమస్యపై అత్యధికంగా 14,904 దరఖాస్తులు అందగా, పాస్ పుస్తకంలో తప్పులు సరిచేయాలని, మ్యుటేషన్ కోసం కూడా దరఖాస్తులు ఎక్కువగానే వచ్చాయి.

చకచకా పరిశీలన

ధరణి దరఖాస్తుల పరిష్కారం చివరిదశకు చేరుకుంది. తహసీల్దార్ మొదలు ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్ వరకు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. తహసీల్దార్ల నేతృత్వంలో నియమించిన కమిటీలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లను పరిశీలించి, దరఖాస్తుదారులు సరైన పత్రాలు సమర్పించకపోతే సమాచారం ఇచ్చి తెప్పించుకుంటున్నారు. ఆతర్వాత ఆర్డీవోలకు, ఆపై అదనపు కలెక్టర్ లాగిన్‌కు చేరుతుండగా ఫైళ్లను పరిశీలించి పరిష్కారం కోసం కలెక్టర్‌కు సమర్పిస్తున్నారు.

ధరణి దరఖాస్తుల్లో వివరాలు

దరఖాస్తు	స్వీకరించినవి	పరిష్కరించినవి	తిరస్కరించినవి
వ్యక్తిగత పీఓబీ	14,904	10,257	3,800
పీపీబీలో సవరణలు	13,319	3,807	3,443
మ్యుటేషన్	13,183	10,734	2,078
ఎల్-ఫామ్ కోసం	12,915	12,779	60
వారసత్వం కోసం	12,857	11,911	666
భూసమస్యలు	8,063	5,645	2,416
కోర్టు కేసులు	2,045	1,118	566
పాస్‌బుక్ లేకుండా నాలా	463	216	57
కోర్టు కేసుల్లో ఉన్న పాస్‌బుక్ కోసం	351	146	123
ఎగ్జిక్యూటెడ్ జీపీఏ	308	277	30
ఖాతాల విలీనం	129	90	08
ఎన్‌ఆర్‌ఐ పీపీబీ	129	92	21



'ఆయిల్‌పామ్' విస్తరణకు కృషి

- రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో సాగు పెంచాలనేదే లక్ష్యం
- అశ్వారావుపేటలో హార్టికల్చర్ కళాశాలకు ప్రతిపాదన
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పవర్ ప్లాంట్ వివరాలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: తెలంగాణను ఆయిల్‌పామ్ హబ్‌గా అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిపేలా కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి శుక్రవారం ఆయన అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో నిర్మిస్తున్న పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆయిల్‌పాం పంట సాగు 11 లక్షల ఎకరాల్లో సాగవుతుండగా, అత్యధికంగా ఏపీలో 5 లక్షల ఎకరాల్లో, తెలంగాణలో రెండు లక్షల ఎకరాల్లో సాగులో ఉందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో తెలంగాణలో పది లక్షల ఎకరాలకు సాగు పెంచాలనే లక్ష్యంతో ఉన్నామని చెప్పారు. దేశంలో వంద లక్షల టన్నుల పామాయిల్ డిమాండ్ ఉంటే, 3.96లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తే జరుగుతోందని తెలి పారు. ఈనేపథ్యాన ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు నష్టమనేదే ఉండదని, ఈ విషయాన్ని గుర్తించి ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు. కాగా, ఆయిల్‌పామ్ మొక్కలు పొడవుగా పెరగడం వల్ల ఇబ్బందులు వస్తున్నందున హైబ్రీడ్, పొట్టి రకాల విత్తనాలపై ఆయిల్‌ఫెడ్ అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు.

టన్ను ధర రూ.15వేలు ఉండాల్సిందే..

ఆయిల్‌పామ్ గెలల టన్నుకు కనీస మద్దతు ధర రూ.15వేల వరకు ఉంటే రైతులకు లాభాలు వస్తాయని మంత్రి తుమ్మల చెప్పారు. ఈ విషయాన్ని కేంద్రం తీసుకెళ్లామని, త్వరలోనే ఏపీ వ్యవసాయ మంత్రితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. పంట సాగు చేసే రైతులు అంతర్ పంటగా కోకో పంట వేస్తే అదనపు ఆదాయాన్ని పొందొచ్చని చెప్పారు. ఆయిల్‌పామ్ టన్ను ధర నిర్ణయాన్ని దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీ ఓఈఆర్ ఆధారంగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. అలాగే పామాయిల్ తోటల్లో విద్యుత్ లైన్లతో ఇబ్బందులు వస్తున్నందున మార్చుకునేందుకు చార్జీలు మినహాయించాలని విద్యుత్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. కాగా, అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఆవరణలో సుమారు రూ.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 2.5 మెగా పవర్ ప్లాంట్‌ను జూలై చివరి నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

మరో ప్రపంచంలోకి వచ్చినట్లు ఉంది!

అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటిస్తే మరో ప్రపంచంలోకి వచ్చినట్లుగా ఉందని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా తెలిపారు. మంత్రి తుమ్మలతో కలిసి ఆయిల్‌పామ్ తోటలు, ఫ్యాక్టరీలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ పామాయిల్, ఉద్యాన తోటలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని చెప్పారు. ఇక్కడ ఉద్యాన కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదన చేస్తానని, వ్యవసాయ కళాశాలలో పీజీ కోర్సు కూడా ప్రారంభానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, డీఓ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ నాగబాబు, ఆయిల్‌ఫెడ్ డైరెక్టర్ ఆలపాటి రామచంద్ర ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డీసీసీబీలో జీఎంల బదిలీ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ల్లో పనిచేస్తున్న జనరల్ మేనేజర్లను కామన్ పూల్ విధానంలో సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ టస్కాబ్(తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్) ఎండీ టి.జ్యోతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 13మంది సొంత జిల్లాలకు బదిలీ అయ్యారు.

ఇందులో భాగంగానే ఖమ్మం జీఎం కాకర్ల నర్మదను నల్లగొండ డీసీసీబీకి, నల్లగొండ జీఎం వి.వసంతరావును ఖమ్మంకు బదిలీ చేశారు. ఇటీవలే డీజీఎంలు, ఏజీఎంలను బదిలీ చేసిన టస్కాబ్ ప్రస్తుతం జీఎంలను సైతం బదిలీ చేయగా, ఒకటి, రెండు రోజుల్లో వారు కొత్త స్థానాల్లో విధుల్లో చేరే అవకాశముంది.

మెరుగైన సేవలు అందించాలి



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు

తిరుమలాయపాలెం: వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలందించాలని జిల్లా వైద్యవిధాన పరిషత్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. తిరుమలాయపాలెం సీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జ్వరాలు, డయేరియా కేసులపై ఆరా తీయడమే కాక బాధితులతో మాట్లాడారు. జ్వరాలు, డయేరియా విభాగాలను వేర్వేరుగా ఏర్పాటుచేసి చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. అలాగే, ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలని తెలిపారు. సీహెచ్‌సీ వైద్యులు బొల్లికొండ శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆధునిక విధానాలతో మెరుగ్గా ఉత్పత్తి

కూసుమంచి: మత్స్య ఉత్పత్తిలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేలా మత్స్యకారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్ సూచించారు. పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల మత్స్యకారులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఈసందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యంతో చేపల ఉత్పత్తిలో రాణించాలన్నారు. అనంతరం రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్, తదితర అంశాలపై శాస్త్రవేత్తలు శాంతన్న, రవీందర్ తదితరులు అవగాహన కల్పించారు.

జల్లెపల్లిలో డెంగీ భయం

ఒకరికి నిర్ధారణ, ముగ్గురికి లక్షణాలు



నీటినిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి, అధికారులు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లి గ్రామంలో పలువురు జ్వరాల బారిన పడడమే కాక డెంగీ పాజిటివ్ కేసులు బయటపడడంతో శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి సహా వివిధ శాఖల అధికారులు పర్యటించారు. గత పదిహేను రోజులుగా ఇక్కడి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వారం క్రితం ఓ వ్యక్తికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో పాటు అదే లక్షణాలతో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. ఇక శుక్రవారం సైతం ఓ వ్యక్తికి ప్లేట్‌లెట్లు తగ్గిపోవడంతో తిరుమలాయపాలెం సీహెచ్‌సీ నుండి ఖమ్మం తరలించారు. మొత్తంగా గ్రామంలో 120 మందికి పైగా జ్వరాల బారిన పడినట్లు తెలుస్తుండగా, అధికారులు పర్యటించారు. అయితే, పారిశుద్ధ్య నిర్వహణ లోపాలతో ఈ పరిస్థితి ఎదురైందంటే గ్రామస్తులు అధికారులను నిలదీశారు. దీంతో గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పారిశుద్ధ్య కార్యక్రమాల్లో వేగం పెంచారు. అంతేకాక ఫాగింగ్ చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లించాలని ఎంపీడీఓ శేషాద్రిని జెడ్పీ సీఈఓ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పుష్పలత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామారావు, ఈఓఆర్డీ రాజేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు స్తంభాద్రి మల్టీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

ఖమ్మంవైద్యవిభాగం: వైద్యులే యాజమాన్యంగా ఏర్పాటు చేసిన స్తంభాద్రి మల్టీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు యాజమాన్య బాధ్యులు ఒక ప్రకటనలో వెల్లడించారు. న్యూరో, ట్రామాకేర్, ఆర్థోపెడిక్, హార్ట్, యూరాలజీ, క్రిటికల్ కేర్ విభాగాల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం జరిగే ప్రారంభోత్సవానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, ఐఎంఏ ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. వివిధ విభాగాల వైద్యులు గట్టినేని సురేశ్, మేదరమెట్ల అనిల్‌కుమార్, గుమ్మడి రాఘవేంద్ర, డోగిపర్తి కృష్ణసుమంత్, మేర్ల హర్షతేజ, చావా సృజన, నవ్య శ్రీలలిత, డోగిపర్తి యస్మిత ఆస్పత్రిలో వైద్యసేవలు అందిస్తారని తెలిపారు.

గిరిజన విద్యార్థినికి ఐఐఎంలో సీటు


బోడ పూజిత

తిరుమలాయపాలెం: పేద కుటుంబంలో పుట్టిన గిరిజన విద్యార్థిని హర్యానా రాష్ట్రంలోని రోథక్ ఐఐఎంలో సీటు సాధించి సత్తా చాటింది. మండలంలోని చంద్రు తండా గ్రామపంచాయతీ పరిధి మారుమూల మద్రితండాకు చెందిన బోడ లక్ష్మణ్ తనకున్న ఎకరం భూమి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఏకైక కుమార్తె పూజిత ఖమ్మం కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి వరకు చదివాక గుంటూరులోని మాస్టర్ మైండ్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసింది. అనంతరం ఈ ఏడాది ఐఐఎం ప్రవేశపరీక్షలో మెరుగైన ర్యాంకు సాధించగా హర్యానా రాష్ట్రంలోని రోథక్ ఐఐఎం కళాశాలలో సీటు లభించడంతో పలువురు అభినందించారు.

ఇన్‌చార్జ్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా రవికుమార్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా బి.రవికుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో ఆయనను వరంగల్‌కు కేటాయించగా, కర్ణాటక రాష్ట్రంలో విధులు నిర్వర్తిస్తున్న వి.వీరభద్రస్వామిని ఖమ్మం బదిలీ చేశారు. ఈనేపథ్యాన రవికుమార్ శుక్రవారం వరంగల్‌లో చేరినప్పటికీ ఖమ్మంలో వీ.వీ.స్వామి బాధ్యతలు స్వీకరించేందుకు వారం నుంచి పది రోజులు సమయం పడుతుందని తెలిసింది. దీంతో రవికుమార్‌కు ఖమ్మం డివిజన్ పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 30న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. అండర్-8, 10, 12 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారితో జిల్లా జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వయసు ధ్రువీకరణపత్రంతో ఉదయం 8గంటలకు హాజరుకావాలని సూచించారు.

ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి..

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో ఉన్న ఆస్పత్రులు యజమాన్యాలువిధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మాలతి ఓ ప్రకటనలో సూచించారు. అంతేకాకుండా అందుతున్న సేవలు, ఫీజులు, వైద్యుల వివరాలను ప్రదర్శించడమే కాక అగ్నిమాపక, బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ, స్కానింగ్ సెంటర్లకు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. అంతేకాక సెల్లార్లలో ల్యాబ్‌లు నిర్వహించొద్దని తెలిపారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేసినట్లు తేలితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక ప్రతీ పేషెంట్ రికార్డులను ఐదేళ్ల భద్రపరచాలని సూచించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,525	6,500
కందులు	10,500	10,500
మిర్చి	16,500	6,000
మిర్చి తాలు	10,200	7,500
ఏసీ మిర్చి	20,000	14,500
ఏసీ తాలు	10,500	9,500
పత్తి	7,250	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,438

మెగా జాబ్‌మేళాకు బారులు

- 2,014 మంది యువతీ, యువకులు హాజరు
- 60 కంపెనీల్లో నియామకాలకు ఇంటర్వ్యూలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, పక్కన జెడ్పీ సీఈఓ వినోద్, డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు


పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న అభ్యర్థులు

కూసుమంచి: జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో జిల్లా యువజన సర్వీసులు, టీజీఎస్‌టీఈపీ (హైదరాబాద్) ఆధ్వర్యాన కూసుమంచి మండలం పాలేరులో నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకాగా జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా కంపెనీలు ముందుకు రావటం అభినందనీయమని తెలిపారు. నిరుద్యోగులు చిన్నాపెద్దా తేడా లేకుండా ఉద్యోగంలో చేరి ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదగాలని సూచించారు. అనంతరం వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆయన నియామక పత్రాలు అందించారు.

60 కంపెనీలు హాజరు

మెగా జాబ్‌మేళాకు హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు చెందిన 60 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా హాజరైన వారిలో 571 మందికి అక్కడికక్కడే నియామక పత్రాలు అందజేశారు. మిగతా వారిలో 1,043 మంది మొదటి రౌండ్ పూర్తి చేసి ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, జెడ్పీ సీఈఓ వినోద్, డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, సీఐ జనార్దన్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలు మతోన్మాదులకు హెచ్చరిక

- బీజేపీ పాలనలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మతోన్మాద శక్తులకు ఒక గుణపాఠం లాంటివని.. మతం ఆధారంగా లబ్ధి పొందాలని ప్రయత్నించిన బీజేపీని ఈ ఎన్నికలు హెచ్చరించాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీ గెలిచినా చావు తప్పి కన్ను లొట్టబోయినట్లయిందని తెలిపారు. బీజేపీకి 400 సీట్లు ఎందుకు రాలేదో అర్థం చేసుకోవాలన్నారు. కాగా, బీజేపీ పాలనలో దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతుండగా, అతి కొద్ది మంది చేతుల్లోకి దేశ సంపద చేరుతుండడంతో దేశం ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తుందని చెప్పారు. ప్రపంచంలో పేదరికం గణనీయంగా పెరుగుతున్న దేశాల్లో భారతదేశం కూడా ఒకటని తెలిపారు. అయినా మోడీ దేశం ఆర్థికంగా వెలిగిపోతోందని అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. కాగా, లోక్‌సభలో బలమైన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఉండడాన్ని సీపీఐ స్వాగతిస్తోందని, ఇదే సమయాన రాష్ట్రంలో రైతుబంధు, రుణమాఫీతో పాటు ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని అడ్డుకునేందుకు జరుగుతున్న పోరాటంలో ముందు నిలవాలని సూచించారు. సీపీఐ విస్తరణ బలోపేతం పై దృష్టి సారిస్తూ, గ్రామశాఖల బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించడమే కాక స్థానిక సంస్థల ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేస్తున్నామని నారాయణ వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా పార్టీ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడ చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను నిలిపివేసి సింగరేణికే నేరుగా కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మంలో శుక్రవారం నిరసన తెలపగా, ఆతర్వాత జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ బొగ్గు బ్లాక్‌లతో పాటు మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌కు సైతం వేలం వేయడం సరికాదన్నారు. సింగరేణిని కాదని వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని, రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, బి.మధు, తాళ్ల నాగరాజు, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, ఎస్.కే.బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌కు చెందిన దోమల వెంకులు ద్విక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఆయన తన వాహనాన్ని గురువారం రాత్రి ఇంటి ఎదుట పార్ చేయగా, శుక్రవారం తెల్లవారుజామున చూసే సరికి పూర్తిగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

భూతగాదాలతో మహిళపై దాడి

నేలకొండపల్లి: భూతగాదాల కారణంగా మండలంలోని మంగాపురం తండాలో ఓ మహిళపై దాడి జరిగింది. మంగాపురంతండాకు చెందిన భూక్యా పూషా – రామచంద్రు దంపతులు శుక్రవారం సాయంత్రం బైక్‌పై పొలం నుంచి ఇంటికి వస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కొండలరావు వీరిని అడ్డగించి దాడి చేయడంతో పూషాకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించి, భూతగాదాలతో దాడి జరిగిందని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

కామేపల్లి: ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడం, బెదిరించడంతో పాటు ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. మండలంలోని కొత్తలింగాలకు చెందిన నేలపట్ల జగన్నాథం తన పొలంలో విద్యుత్ స్తంభాలను జేసీబీతో తీయిస్తుండగా లైన్‌మెన్ సురేష్ వెళ్లి అడ్డుకున్నాడు. దీంతో సురేష్ బెదిరించి స్తంభాలు తొలగించాడు. ఈమేరకు ఏఈ శ్రీనివాసులు ఫిర్యాదుతో జగన్నాథం, జేసీబీ డ్రైవర్ చల్లా వంశీపై శుక్రవారం కేసు నమోదు చేసి, జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మోతాదుకు మించి మందులు ఇచ్చిన ఆర్‌ఎంపీపై..

కారేపల్లి: ఓ గ్రామీణ వైద్యుడు చికిత్స కోసం వచ్చిన వ్యక్తికి అధిక మోతాదులో యాంటీ బయాటిక్స్ మందులు, ఇంజక్షన్లు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ ఎస్.రాజారాం తెలిపారు. మండలంలోని గాదెపాడుకు చెందిన గ్రామీణ వైద్యుడు అన్వర్ వద్దకు అదే గ్రామానికి చెందిన సైఫ్‌జాన్ వారం క్రితం వచ్చాడు. ఆయనకు అధిక మోతాదులో యాంటీబయాటిక్స్ ఇవ్వడంతో బీపీ తగ్గి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అన్వర్ ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స ఖర్చులన్నీ భరిస్తానని హామీ ఇచ్చాడు. కానీ బిల్లు చెల్లించే సమయాన ముఖం చాటేయడంతో సైఫ్‌జాన్ ఫిర్యాదు మేరకు ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే కేసులు

పోలీసు కమిషనర్ సునీల్‌దత్


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్ తొలగించి, నెంబర్ కనిపించకుండా మార్పులు చేసి వాహనాలు నడిపితే ఐపీసీ సెక్షన్ 420 కింద కేసులు నమోదు చేస్తామని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతూ పట్టుబడిన 45మంది ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల కాలంలో దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు పోలీసుల నుండి తప్పించుకునేందుకు ద్విచక్రవాహనాల నంబర్ ప్లేట్లను తొలగిస్తున్నారని చెప్పారు. అలాగే, చోరీ చేసిన వాహనాలకు సైతం నంబర్ ప్లేట్లు మారుస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈనేపథ్యాన ఎవరైనా వాహనాలు అమ్మినా, కొన్నా కచ్చితంగా రిజిస్ట్రేషన్ మార్పించుకోవాలని, నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటుచేయించుకోవాలని సూచించారు. ఇక మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై ఎంవీ యాక్ట్ కింద కేసులను నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ మోహన్‌బాబు, ఎస్ఐలు రవి, సాగర్ పాల్గొన్నారు.

నూతన ఆర్థిక విధానాల రూపకర్త పీవీ


పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: దేశంలో నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి మాజీ ప్రధాని పీ.వీ. నర్సింహారావు అని మేయర్ నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. పీవీ జయంతి వేడుకలను ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక నీరజ, దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ బహుభాషా కోవిదుడైన పీవీ దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరిచేందుకు చేసిన సేవలు మరువలేనివన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డగా ప్రధాని హోదాలో తెలుగువారి ఖ్యాతిని ఇనుమడింపచేశారని తెలిపారు. నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, రబ్బానీ, కొత్తా సీతారాములు, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, ఆళ్ల అంజిరెడ్డి, భూక్యా బాలాజీనాయక్, గజ్జెల్లి వెంకన్న, గజ్జి సూర్య నారాయణ, శెట్టి రంగారావు, ఎండీవై.పాషా, బీరెడ్డి రమేష్, గద్దం వెంకటయ్య, ప్రతిభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఉక్కు సంకల్పం నెరవేరింది..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్


మాట్లాడుతున్న తాతా మధుసూదన్, పక్కన బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీతారామ ప్రాజెక్టు ట్రయల్‌రన్ విజయవంతంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉక్కుసంకల్పం నెరవేరినట్లయిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అపర భగీరథుడిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అంకురార్పణ చేసిన ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతం కావడంపై బీఆర్ఎస్ హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. గోదావరి జలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయబోతుండటం సంతోషంగా ఉందని తెలిపారు. అయితే, ప్రాజెక్టు ఇన్నాళ్లు కుంభకోణమని నిందించిన వారు, ఇప్పుడు ఎలా ట్రయల్‌రన్‌ను ప్రారంభించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని తమదిగా చెప్పుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు పునాది వేసింది.. పూర్తి చేసింది కేసీఆర్ అని, ఫలితం మాత్రం కాంగ్రెస్‌దని ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అప్పటి కాంగ్రెస్ నాయకులే ఎన్నో కేసులు వేసి సీతారామను ఆపాలని చూసినా కేసీఆర్ ఉక్కు సంకల్పం ముందు వారి పాచికలు పారలేదని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు ఉప్పల వెంకటరమణ, బెల్లం వేణు, తాజుద్దీన్, బిచ్చల తిరుమల్‌రావు, బొమ్మెర రామ్మూర్తి, సుబ్బారావు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే విజయాలు

ఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానించిన పీఓ


ఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులతో పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలం/కొణిజర్ల: విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివితే విజయాలు సొంతం కావడంతో పాటు ఇతరులకు మార్గదర్శకంగా నిలవొచ్చని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. ఇల్లెందు మండలం పోలంపల్లికి చెందిన ధరావత్ రవికుమార్ ఐఐటీ ముంబైలో సీటు సాధించగా, పీఓ ఆయనకు శుక్రవారం భద్రాచలంలోని కార్యాలయంలో ల్యాప్‌టాప్ అందించారు. అలాగే, కొణిజర్ల మండలం తనికెళ్లలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో చదివి ఐఐటీ ముంబైలో ఎమ్మెస్సీ సీట్లు సాధించిన సుజాతనగర్ మండలం ఉప్పరిగూడెంనకు చెందిన ఎం.లిఖిత, కూసుమంచి మండలం కోకియాతండాకు చెందిన బానోత్ శ్రావణి, ఐఐటీ బిలాయ్‌లో సీటు సాధించిన దుమ్ముగూడెం మండలం బండిరేవుకు చెందిన సోయం వాసవిని పీఓ అభినందించారు. ఖమ్మం ఆర్‌సీఓ టీ.వీ.రాజు, తనికెళ్ల కాలేజీ ప్రిన్సిపాల్ కె.మానస, అధ్యాపకులు బి.హరీష్, డాక్టర్ డి.శ్రావణి, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు. కాగా, ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పీఓ రాహుల్‌ను ఖమ్మం, భద్రాచలం డీడీలు విజయలక్ష్మి, మణెమ్మ, ఇతర అధికారులు సన్మానించారు.

స్వర్ణకవచధారణలో రామయ్య


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం


జేవీఆర్ ఓసీలో వర్షంతో నిలిచిన వాహనాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన వర్షం కారణంగా సుమారు 60 వేల టన్నుల ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 22 భూగర్భగనులు, 18 ఓసీల్లో రోజుకు 2.15 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 1.55 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదైంది. కొత్తగూడెం ఏరియాలో 45 వేల టన్నులకు 32 వేల టన్నులు, ఇల్లెందులో 11 వేల టన్నులకు 8 వేల టన్నులు, మణుగూరు ఏరియాలో 44 వేల టన్నులకు 34 వేల టన్నులు ఉత్పత్తి సాధించారు. దీంతో అధికారులు క్వారీల్లో భారీ వాహనాలను నడిపించాలని నిర్ణయించగా, క్వారీల్లో చేరిన వర్షం నీటిని ప్లాన్‌టూన్ పంప్‌ల ద్వారా తొలగించడంలో నిమగ్నమయ్యారు.

ఈపీ ఆపరేటర్ల పోస్టులు పెంచిన యాజమాన్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఇటీవల 68 ఈపీ ఆపరేటర్ ట్రెయినీ (ఇంటర్నల్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే పోస్టులను మరో 32 పెంచుతూ శుక్రవారం సర్క్యులర్ విడుదల చేసినట్లు జీఎం (పర్సనల్) బీఆర్ దీక్షితులు తెలిపారు. అంతేకాక ఎంపికైన అభ్యర్థులు కచ్చితంగా ఐదేళ్ల పాటు మణుగూరు ఏరియాలో పనిచేసేలా నిబంధన పొందుపర్చామని పేర్కొన్నారు. ఇప్పటికే అభ్యర్థులకు డ్రైవింగ్ పరీక్ష నిర్వహించగా, ఎంపికైన 800 మందికి ఈ నెల 30న సింగరేణి ఉమెన్స్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు తుదిజాబితా వెల్లడిస్తామని, అనంతరం ప్రతిభతో పాటు రిజర్వేషన్ ఆధారంగా పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.

33 కేవీ స్విచ్ స్టేషన్ షురూ

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీవీకాలనీ బంగ్లాస్ ఏరియాలో నూతనంగా నిర్మించిన 33 కేవీ స్విచ్ స్టేషన్‌ను శుక్రవారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, వీరభద్రరావు, రమేశ్, మదన్ నాయక్, అనురాధ, రాంబాబు, వీరభద్రుడు, రాజేశ్వరరావు, శేషగిరిరావు, మధుసూదన్, శోభన్‌బాబు, ఈశ్వర్, వై.కృష్ణంరాజు, కృష్ణమూర్తి ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

- పరీక్ష ఫీజు చెల్లించి వస్తుండగా ఘటన

ఖమ్మంఅర్బన్: జిల్లాకేంద్రంలోని ఖమ్మం– వైరా ప్రధాన రోడ్డు పుట్టకోట క్రాస్ సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బీటెక్ విద్యార్థి కొత్తపల్లి ప్రవీణ్‌కుమార్(21) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం. ముదిగొండ మండల కట్టకూరుకు చెందిన ప్రవీణ్‌కుమార్ ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండాలో సోదరుడితో ఉంటూ కొణిజర్ల మండలం తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆయన గురువారం తన బంధువైన అరవింద్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి కాలేజీ ఫీజు చెల్లించి వస్తుండగా వెనక నుండి వచ్చిన గ్యాస్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రవీణ్, అరవింద్‌కు గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం మృతి చెందడంతో ఆయన తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆయిల్ ట్యాంకర్ నుంచి డీజిల్ చోరీ

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు క్రాస్ వద్ద సాయిమదీనా పెట్రోల్ బంక్‌లో శుక్రవారం తెల్లవారుజామున డీజిల్ చోరీ జరిగింది. బంక్‌లో నిలిపిన ఆయిల్ ట్యాంకర్ నుంచి కారులో వచ్చిన గుర్తుతెలియని దుండగులు రూ.19వేల విలువైన 200 లీటర్ల డీజిల్ దొంగిలించారు. మాజమాన్యం ఫిర్యాదుతో పరిశీలించిన ఎస్సై గిరిధర్ సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా గాలింపు చేపట్టారు.

చోరీ చేస్తూ పట్టుబడిన వ్యక్తి

నేలకొండపల్లి: సెంట్రింగ్ సామగ్రి చోరీ చేస్తూ ఓ వ్యక్తి పట్టుబడగా పోలీసులకు అప్పగించారు. నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి వద్ద కోదాడ-కురవి జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతుండగా, తరచుగా సెంట్రింగ్ సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. ఈక్రమంలో గత నెల 9న ఓ వ్యక్తి చోరీకి పాల్పడగా కంపెనీ సిబ్బంది మొదటి తప్పుగా హెచ్చరించి వదిలేశారు. అయితే, శుక్రవారం కూడా సదరు వ్యక్తి పైపులు, చువ్వలను చోరీ చేస్తుండగా పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు.